


జాతీయ తెలుగు దినపత్రిక

RNI - TGTEL/25/A0348

# సందేశ టైమ్స్

నిజం దాగదు – వార్త ఆగదు




సోమవారం 08 జూన్ 2026 | పేజీలు : 04 | వెల - రూ 2/- | సంపుటి : 02 సంచిక : 006 | ప్రచురణ : తెలంగాణ & ఆంధ్రప్రదేశ్ | ఎడిటర్ : శెట్టి వెంకటేష్

# మూసీ ప్రక్షాళన ఫేజ్-2కు సీఎం రేవంత్ రెడ్డి శ్రీకారం.. మేడ్చల్-మల్కాజిగిరికి రూ.1,511 కోట్ల అభివృద్ధి పనులు

## మెట్రో విస్తరణ, మూసీ పునరుజ్జీవంతో నగరానికి నూతన దిశ






సందేశం టైమ్స్, హైదరాబాద్, జూన్ 08, ప్రతినిధి: నాగోల్ నుంచి గౌరెల్లి వరకు మూసీ నది ప్రక్షాళన ఫేజ్-2 పనులను వంద రోజుల్లో ప్రారంభించాలని ముఖ్యమంత్రి శ్రీ ఎ. రేవంత్ రెడ్డి అధికారులను ఆదేశించారు. మూసీ నది పునరుజ్జీవన కార్యక్రమంలో భాగంగా ఇప్పటికే గండిపేట నుంచి గాంధీ సరోవర్ వరకు తొలి దశ పనులు కొనసాగుతుండగా, రెండో దశగా నాగోల్ నుంచి గౌరెల్లి వరకు కార్యాచరణ చేపట్టాలని స్పష్టం చేశారు. ఉప్పల్ భగాయత్ ఫేజ్-3లో 10 ఎకరాల విస్తీర్ణంలో రూ.98 కోట్ల వ్యయంతో నిర్మించనున్న మల్కాజిగిరి మున్సిపల్ కార్పొరేషన్ కార్యాలయ భవనానికి సీఎం శంకుస్థాపన చేశారు. ఈ కార్యక్రమంలో మంత్రులు దుద్దిళ్ల శ్రీధర్ బాబు, దామోదర రాజనర్సింహతో పాటు ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు. మేడ్చల్-మల్కాజిగిరి జిల్లాలో రూ.1,511 కోట్ల విలువైన పలు అభివృద్ధి పనులకు సీఎం శ్రీకారం చుట్టారు. ఇందులో రూ.960 కోట్లతో ఏఓసీ సెంటర్‌లో ప్రత్యామ్నాయ రోడ్ల నిర్మాణం, రూ.416 కోట్లతో టీకేఆర్ కాలేజ్ జంక్షన్ వద్ద ఆరు లైన్ల ఫ్లైఓవర్, రూ.37.50 కోట్లతో 100 పడకల జిల్లా ఆస్పత్రి నిర్మాణం ఉన్నాయి. ప్రజాపాలన-ప్రగతి ప్రణాళికలో భాగంగా కామన్ యూనిఫైడ్ బిల్లింగ్ అండ్ కలెక్షన్ సిస్టమ్ 'క్యూర్-1' యాప్‌ను కూడా ముఖ్యమంత్రి ప్రారంభించారు. సభలో మాట్లాడుతూ హైదరాబాద్‌ను అంతర్జాతీయ నగరంగా చెప్పుకోవడం సరిపోదని, అదే స్థాయిలో అభివృద్ధి జరగాలని సీఎం పేర్కొన్నారు. నగరంలో 122 కిలోమీటర్ల మేర మెట్రో విస్తరణ అవసరమని, నాగోల్ నుంచి ఎల్బీనగర్, ఓవైసీ హాస్పిటల్ మీదుగా అంతర్జాతీయ విమానాశ్రయం వరకు, అలాగే ఎల్బీనగర్ నుంచి హయత్‌నగర్ వరకు విస్తరించనున్నట్లు వెల్లడించారు. మెట్రో విస్తరణ, రీజినల్ రింగ్ రోడ్, మూసీ ప్రక్షాళన వంటి కార్యక్రమాలకు కేంద్ర మంత్రులు సహకరించాలని కోరారు. గుజరాత్‌లో సబర్మతి రివర్ ఫ్రంట్, ఢిల్లీలో యమునా రివర్ ఫ్రంట్, యూపీలో గంగానది ప్రక్షాళన చేసినప్పుడు మూసీ నది ప్రక్షాళన ఎందుకు చేయకూడదని ప్రశ్నించారు. 55 కిలోమీటర్ల మూసీ నదిని శుభ్రపరిస్తే నగర అభివృద్ధితో పాటు యువతకు ఉపాధి అవకాశాలు పెరుగుతాయని అన్నారు. మూసీ పరివాహక ప్రాంత ప్రజలు తీవ్ర కాలుష్యంతో ఇబ్బందులు పడుతున్నారని, పారిశ్రామిక వ్యర్థాలు, కాలుష్య ప్రభావం నల్గొండ ప్రజల జీవితాలను దెబ్బతీస్తోందన్నారు. ఫ్లోరైడ్ సమస్యతో పాటు మూసీ కాలుష్యం నల్గొండ జిల్లాను తీవ్రంగా ప్రభావితం చేస్తోందని పేర్కొన్నారు. ఏ పేదవాడికీ అన్యాయం చేయబోమని, ఇళ్లు కోల్పోయిన వారికి ఇండ్లు కట్టించి ఇస్తామని, వారి పిల్లలకు మంచి విద్య అందిస్తామని హామీ ఇచ్చారు. గతంలో గ్రామపంచాయతీలు, మున్సిపాలిటీలు, కార్పొరేషన్లు, జీహెచ్ఎంసీ పరిధులతో పరిపాలనలో సమన్వయం లేక అభివృద్ధికి ఆటంకాలు ఏర్పడ్డాయని, ఇప్పుడు ఓఆర్ఆర్ లోపలి 2100 చదరపు కిలోమీటర్ల ప్రాంతాన్ని 'క్యూర్' ప్రాంతంగా గుర్తించి హైదరాబాద్, సైబరాబాద్, మల్కాజిగిరి అనే మూడు కార్పొరేషన్లుగా వికేంద్రీకరించినట్లు తెలిపారు. ఇదే విధంగా పోలీసు వ్యవస్థను కూడా వికేంద్రీకరించామని పేర్కొన్నారు. లోక్‌సభ సభ్యుడిగా మల్కాజిగిరి నియోజకవర్గానికి ఆశించిన స్థాయిలో సేవ చేయలేకపోయానని, ఇప్పుడు ముఖ్యమంత్రిగా ప్రతి అభివృద్ధి పనిని పూర్తి చేసే బాధ్యత తీసుకుంటానని సీఎం స్పష్టం చేశారు. మల్కాజిగిరి అభివృద్ధికి అవసరమైనన్ని నిధులు ప్రభుత్వం అందిస్తుందని, అన్ని అనుమతులు ఇవ్వడానికి సిద్ధంగా ఉన్నామని తెలిపారు. ఉప్పల్ ఎలివేటెడ్ కారిడార్‌కు బండారి రాజిరెడ్డి పేరు పెట్టామని గుర్తు చేస్తూ, చౌరస్తాలో ఆయన విగ్రహాన్ని కూడా ఏర్పాటు చేస్తామని ప్రకటించారు.

## వంజరి, ఎస్ఎస్‌కే సమాజ్ భవనాలను ప్రారంభించిన సీఎం రేవంత్ రెడ్డి





సందేశం టైమ్స్, హైదరాబాద్, జూన్ 08, ప్రతినిధి: ముఖ్యమంత్రి శ్రీ ఎ. రేవంత్ రెడ్డి గారు ఉప్పల్ భగాయత్‌లో నూతనంగా నిర్మించిన వంజరి కుల ఆత్మగౌరవ భవనాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు గారు, రాజ్యసభ సభ్యులు, లోక్‌సభ సభ్యులు, స్థానిక ప్రజాప్రతినిధులు ముఖ్యమంత్రితో కలిసి కార్యక్రమంలో పాల్గొన్నారు. అనంతరం ముఖ్యమంత్రి గారు ఉప్పల్ భగాయత్‌లో నిర్మించిన శ్రీ సోమవంశ సహస్రార్జున క్షత్రియ (ఎస్ఎస్‌కే) పట్కర్ (ఖత్రి) ప్రాంతీయ సమాజ్ తెలంగాణ భవనాన్ని కూడా ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు గారితో పాటు పలువురు ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు. సమాజ భవనాలు సామాజిక ఐక్యతకు, సంస్కృతి పరిరక్షణకు కేంద్రాలుగా నిలవాలని ముఖ్యమంత్రి ఆకాంక్షించారు.

## రేవంత్ వ్యాఖ్యలకు కిరణ్ రిజిజు కౌంటర్.. దేశాన్ని ప్రాంతాల పేరుతో విభజించొద్దు

సందేశం టైమ్స్, న్యూఢిల్లీ, జూన్ 08, ప్రతినిధి: తెలంగాణ ముఖ్యమంత్రి ఎ. రేవంత్ రెడ్డి చేసిన వ్యాఖ్యలకు కేంద్ర మంత్రి కిరణ్ రిజిజు కౌంటర్ ఇచ్చారు. దక్షిణాది, ఉత్తరాది అంటూ దేశాన్ని విభజించే ప్రయత్నాలు చేయవద్దని సూచించారు. "మనమంతా భారతీయులమే. రాష్ట్రపతి తూర్పు భారతదేశంలోని ఒడిశాకు చెందిన గిరిజన వర్గ నాయకురాలు. ప్రధాని పశ్చిమ భారతదేశంలోని గుజరాత్‌కు చెందిన నాయకుడు. ఉపరాష్ట్రపతి దక్షిణ భారతదేశంలోని తమిళనాడుకు చెందిన వ్యక్తి" అని కిరణ్ రిజిజు పేర్కొన్నారు. ప్రాంతాల పేరుతో రాజకీయాలు చేయకుండా దేశ సమగ్రతను కాపాడాల్సిన అవసరం ఉందని ఆయన వ్యాఖ్యానించారు.



## గోదావరి-కావేరి అనుసంధానంపై చంద్రబాబు కుట్ర: హరీష్ రావు ఆరోపణ

సందేశం టైమ్స్, హైదరాబాద్, జూన్ 08, ప్రతినిధి: గోదావరిలో మిగులు జలాలు లేవని కేంద్ర ప్రభుత్వం స్పష్టం చేసిందని, అలాంటప్పుడు మిగులు జలాల ఆధారంగా డీపీఆర్‌కు ఆమోదం తెలపడం సాధ్యం కాదని మాజీ మంత్రి హరీష్ రావు పేర్కొన్నారు. అన్ని ప్రయత్నాలు విఫలమవడంతో గోదావరి-కావేరి నదుల అనుసంధానం పేరుతో ఏపీ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు కొత్త కుట్రకు తెరలేపారని ఆరోపించారు. బీఆర్ఎస్ ప్రభుత్వం అధికారంలో ఉన్నప్పుడు సమ్మక్క-సారక్క ప్రాజెక్టు నుంచి నదుల అనుసంధానం ప్రారంభించాలని ప్రతిపాదించామని, ఆ ప్రతిపాదనకు ఏపీ, కర్ణాటక రాష్ట్ర ప్రభుత్వాలు, కేంద్ర ప్రభుత్వం కూడా అంగీకరించాయని గుర్తుచేశారు. తెలంగాణకు అన్యాయం జరగకుండా సమ్మక్క-సారక్క నుంచి నాగార్జునసాగర్, అక్కడి నుంచి సోమశిల మీదుగా కావేరీ నదికి అనుసంధానం చేయాలని బీఆర్ఎస్ ప్రభుత్వం సూచించిందన్నారు. కానీ ప్రస్తుతం తెలంగాణ భూభాగానికి సంబంధం లేకుండా పోలవరం నుంచి నల్లమల సాగర్ మీదుగా కావేరీ నదికి అనుసంధానం చేయాలని చంద్రబాబు ప్రతిపాదిస్తే కేంద్రం ఆమోదం తెలుపుతోందని విమర్శించారు. ఈ మొత్తం వ్యవహారంపై ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి మౌనంగా ఉండడం వెనుక అర్థం ఏమిటని ప్రశ్నించారు. ఏపీ ప్రభుత్వం ఆదర్శంగా చెప్పుకునే కేఎల్ రావు కూడా నదుల అనుసంధానం తెలంగాణ నుంచే జరగాలని సూచించారని తెలిపారు. ఏపీ బీజేపీ ఎంపీలు కేంద్రాన్ని కీలు బొమ్మలా ఆడిస్తుంటే తెలంగాణ బీజేపీ ఎంపీలు మాత్రం మౌనంగా చూస్తున్నారని హరీష్ రావు విమర్శించారు.




## కృషి డిఫెన్స్ కాలనీలో పర్యటించిన ఎమ్మెల్యే జీఎంఆర్.. సమస్యల పరిష్కారానికి హామీ

సందేశం టైమ్స్, పటాన్చెరు, జూన్ 08, బి డేవిడ్: పటాన్చెరు డివిజన్ పరిధిలోని కృషి డిఫెన్స్ కాలనీ అభివృద్ధికి సంపూర్ణ సహకారం అందిస్తామని పటాన్చెరు ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి తెలిపారు. ఆదివారం ఉదయం మాజీ ప్రజాప్రతినిధులు, బల్దియా అధికారులతో కలిసి కాలనీలో పర్యటించిన ఆయన స్థానికులతో సమావేశమై వారి సమస్యలను స్వయంగా అడిగి తెలుసుకున్నారు. ముఖ్యంగా వర్షాకాలంలో వర్షపు నీరు బయటకు వెళ్లకపోవడంతో తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నామని కాలనీవాసులు ఎమ్మెల్యే దృష్టికి తీసుకువచ్చారు. దీనిపై స్పందించిన జీఎంఆర్ అతి త్వరలో వర్షపు నీటి పారుదల కోసం ప్రత్యేక డ్రైన్ నిర్మాణానికి ప్రతిపాదనలు సిద్ధం చేయాలని ఇంజనీరింగ్ విభాగం డీఈ కృష్ణవేణికి ఆదేశించారు. కాలనీలో హైమాస్ట్ లైట్లు ఏర్పాటు చేయడంతో పాటు బీటీ రోడ్ల పునరుద్ధరణ పనులు చేపడతామని తెలిపారు. ప్రజల కోరిక మేరకు హిందూ, ముస్లిం, క్రిస్టియన్ ప్రార్థనా మందిరాల నిర్మాణానికి ఎలాంటి వివాదాలు లేకుండా కాలనీలోనే స్థలాలు కేటాయిస్తామని హామీ ఇచ్చారు. కాలనీలోని ఇండోర్ స్టేడియం అభివృద్ధికి పూర్తి సహకారం అందిస్తానని పేర్కొంటూ అభివృద్ధిలో ప్రతి ఒక్కరు భాగస్వాములు కావాలని కోరారు.

## యంగ్ ఇండియా రెసిడెన్షియల్ స్కూల్ పనులను పరిశీలించిన డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క





సందేశం టైమ్స్, ఖమ్మం, జూన్ 08, ప్రతినిధి: మధిర నియోజకవర్గ పరిధిలోని బోనకల్లు మండలం లక్ష్మీపురం గ్రామంలో నిర్మాణంలో ఉన్న యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ స్కూల్ నిర్మాణ పనులను డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క మల్లు క్షేత్రస్థాయిలో పరిశీలించారు. ఈ సందర్భంగా నిర్మాణంలో ఉన్న జూనియర్, సీనియర్ హాస్టళ్లు, అడ్మినిస్ట్రేటివ్ బ్లాక్, సైన్స్, మ్యాథమెటిక్స్, కంప్యూటర్, మెకానికల్ ల్యాబ్ భవనాల పనుల పురోగతిని స్వయంగా పరిశీలించి అధికారులకు, గుత్తేదారులకు పలు సూచనలు చేశారు. రాష్ట్ర ప్రభుత్వం నిర్మిస్తున్న యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ పాఠశాలలు కేవలం భవనాలు మాత్రమే కాదని, రేపటి తరాలను తీర్చిదిద్దే దార్శనిక దేవాలయాలని డిప్యూటీ సీఎం పేర్కొన్నారు. విద్యకు ఇందిరమ్మ ప్రజా ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యత ఇస్తోందని స్పష్టం చేశారు. నిర్మాణ పనుల్లో ఎక్కడా నాణ్యత లోపించకుండా అత్యున్నత ప్రమాణాలు పాటించాలని, పనులను మరింత వేగవంతం చేసి నిర్ణీత గడువులోగా పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. విద్య కోసం ప్రభుత్వం ఖర్చు చేసే ప్రతి రూపాయి వ్యయం కాదని, భవిష్యత్ తరాల అభివృద్ధికి పెట్టే పెట్టుబడి అని భట్టి విక్రమార్క పేర్కొన్నారు. విద్యార్థులకు అత్యుత్తమ విద్యా వాతావరణం కల్పించాలనే లక్ష్యంతో ప్రభుత్వం ముందుకు సాగుతోందన్నారు.



## సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కులను అందించిన కొప్పుల శేషారెడ్డి

సందేశం టైమ్స్, సంగారెడ్డి, జూన్ 08, అందోల్ టౌన్ ప్రతినిధి బి రమేష్ బాబు: అందోల్ నియోజకవర్గంలోని అల్లాదుర్గ్ మండల పరిధిలోని పలు గ్రామాలకు చెందిన లబ్ధిదారులకు సీఎం సహాయనిధి చెక్కులను అల్లాదుర్గ్ మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు కొప్పుల శేషారెడ్డి అందజేశారు. మంత్రి దామోదర రాజనర్సింహా సహకారంతో సీఎం సహాయనిధి ద్వారా మంజూరైన రూ.13,48,500 విలువైన చెక్కులను బాధిత కుటుంబాలకు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా కొప్పుల శేషారెడ్డి మాట్లాడుతూ గత ప్రభుత్వ హయాంలో సీఎం రిలీఫ్ ఫండ్, కళ్యాణలక్ష్మి, షాదీ ముబారక్ వంటి పథకాలు సక్రమంగా అందలేదని, ప్రస్తుతం కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజా ప్రభుత్వంగా ప్రతి పేద కుటుంబానికి పార్టీలకతీతంగా ఇందిరమ్మ ఇళ్లు, షాదీ ముబారక్, కళ్యాణలక్ష్మి, సీఎం రిలీఫ్ ఫండ్, రేషన్ కార్డులు వంటి సంక్షేమ పథకాలను అందిస్తున్నదని తెలిపారు. మంత్రి దామోదర రాజనర్సింహ పేదల సంక్షేమం కోసం అనేక పథకాలను అమలు చేస్తున్నారని, ప్రజలు వాటిని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఎస్సీ సెల్ జిల్లా ఉపాధ్యక్షులు బలరాం, డీసీసీ జిల్లా కార్యదర్శులు బాలకిషన్, అంజాగౌడ్, సర్పంచులు శశిధర్ రెడ్డి, శ్రీనివాస్ రెడ్డి, శంకర్ నాయక్, వీరన్న, మన్నే నాయక్, సోషల్ మీడియా కోఆర్డినేటర్ జైపాల్, వార్డ్ మెంబర్ సత్యనారాయణ, ఎస్టీ సెల్ జిల్లా ఉపాధ్యక్షుడు జైపాల్ నాయక్, శ్రీకాంత్, పాపయ్య, జెమినీ భాయ్, వెంకట్, శ్రీను, బాల్రాజ్, రాజు నాయక్, ముజీబ్, సురేష్ సేట్, సురేష్ గుప్తా, ఉప సర్పంచ్ శ్రీకాంత్, నర్సింలు, సాయిబాబా, మదర్, నాయకులు, కార్యకర్తలు, లబ్ధిదారులు పాల్గొన్నారు.

## ముదిగొండలో అభివృద్ధి పరుగులు.. కోట్లాది రూపాయల పనులకు భట్టి విక్రమార్క శ్రీకారం





సందేశం టైమ్స్, ఖమ్మం, జూన్ 08, ప్రతినిధి: ఖమ్మం జిల్లా మధిర నియోజకవర్గంలోని ముదిగొండ మండలంలో రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క ఆదివారం విస్తృతంగా పర్యటించి కోట్లాది రూపాయల అభివృద్ధి పనులకు శంకుస్థాపనలు, ప్రారంభోత్సవాలు నిర్వహించారు. గ్రామీణ ప్రాంతాల్లో మౌలిక సదుపాయాల కల్పనే లక్ష్యంగా ప్రజా ప్రభుత్వం ముందుకు సాగుతోందని పేర్కొంటూ పలు కీలక అభివృద్ధి కార్యక్రమాలకు శ్రీకారం చుట్టారు. మండలంలోని ఎడవల్లి లక్ష్మీపురం గ్రామంలో మహాత్మా గాంధీ జాతీయ ఉపాధి హామీ పథకం నిధులతో రూ.20 లక్షల వ్యయంతో నిర్మించిన నూతన గ్రామ పంచాయతీ కార్యాలయాన్ని ఉప ముఖ్యమంత్రి ప్రారంభించారు. ఈ భవనం ద్వారా గ్రామస్తులకు పరిపాలన మరింత చేరువ అవుతుందని తెలిపారు. రైతులు, గృహ మరియు వాణిజ్య అవసరాలకు నాణ్యమైన విద్యుత్ అందించేందుకు ఎడవల్లి గ్రామంలో రూ.3.15 కోట్ల వ్యయంతో నిర్మించనున్న 33/11 కేవీ సబ్ స్టేషన్‌కు శంకుస్థాపన చేశారు. ముదిగొండ మండల కేంద్రంలో ప్రజల సౌకర్యార్థం రూ.25 లక్షలతో నిర్మించనున్న ఈఆర్వో కార్యాలయానికి కూడా భూమిపూజ నిర్వహించారు. రవాణా రంగాన్ని బలోపేతం చేసేందుకు ఎడవల్లి నుంచి తల్లంపాడు వరకు రహదారి విస్తరణ పనులు, ఎడవల్లి నుంచి లక్ష్మీపురం మీదుగా తెల్దారుపల్లి వరకు రోడ్డు నిర్మాణ పనులకు శంకుస్థాపన చేశారు. ఈ పర్యటనలో అత్యంత కీలకంగా ఎన్‌హెచ్ 365ఏ (కోదాడ-ఖమ్మం-కురివి), ఎన్‌హెచ్ 365బీబీ (సూర్యాపేట-అశ్వారావుపేట) జాతీయ రహదారులను అనుసంధానం చేసే రూ.33 కోట్ల విలువైన భారీ ప్రాజెక్టుకు ఉప ముఖ్యమంత్రి లాంఛనంగా శంకుస్థాపన చేశారు. ఈ రహదారుల అభివృద్ధితో రవాణా సౌకర్యాలు మెరుగుపడటంతో పాటు పారిశ్రామిక, వ్యవసాయ రంగాలకు ఊతం లభిస్తుందని ప్రజలు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. అనంతరం ముదిగొండ మండల కేంద్రంలో 50 పడకలతో నిర్మిస్తున్న ఆసుపత్రి పనులను పరిశీలించిన భట్టి విక్రమార్క నిర్మాణాల్లో ఎలాంటి అలసత్వం ప్రదర్శించరాదని అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమాల్లో జిల్లా కలెక్టర్ దివాకర టీఎస్, జాయింట్ కలెక్టర్ శ్రీనివాస రెడ్డి, రాష్ట్ర గిడ్డంగుల సంస్థ చైర్మన్ రాయల నాగేశ్వరరావు, హస్తకళల అభివృద్ధి సంస్థ చైర్మన్ నాయుడు సత్యనారాయణ, సుడా చైర్మన్ పువ్వాళ్ల దుర్గాప్రసాద్, స్థానిక ప్రజాప్రతినిధులు, అధికారులు, ప్రజలు పాల్గొన్నారు.

## కాకినాడ జిల్లాలో ఘనంగా "సండేస్ ఆన్ సైకిల్" కార్యక్రమం




సందేశం టైమ్స్, కాకినాడ, జూన్ 08, ప్రతినిధి: ఫిట్ ఇండియా సైకిల్ డ్రైవ్‌లో భాగంగా కాకినాడ జిల్లా పోలీసు శాఖ ఆధ్వర్యంలో "సండేస్ ఆన్ సైకిల్" కార్యక్రమాన్ని జిల్లా వ్యాప్తంగా ఘనంగా నిర్వహించారు. జిల్లా పోలీసు అధికారి శ్రీ జి. బిందు మాధవ్ ఐపీఎస్ ఆదేశాల మేరకు నిర్వహించిన ఈ కార్యక్రమంలో జిల్లా పోలీసు అధికారులు, సిబ్బంది, ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. జిల్లా ఎస్పీ స్వయంగా సైక్లింగ్‌లో పాల్గొని సైక్లింగ్‌ను రోజువారీ జీవితంలో భాగంగా చేసుకోవడం ద్వారా ఆరోగ్యాన్ని కాపాడుకోవడంతో పాటు కాలుష్య నియంత్రణకు కూడా తోడ్పడవచ్చని తెలిపారు. యువతతో పాటు అన్ని వయస్సుల ప్రజలు సైక్లింగ్‌ను అలవాటు చేసుకోవాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో కాకినాడ సబ్ డివిజనల్ ఆఫీసర్ దేవ్ రాజ్ మనీష్ పాటిల్ ఐపీఎస్, ఎస్‌బీ డీఎస్పీ కెవివి సత్యనారాయణ, రిజర్వ్ ఇన్‌స్పెక్టర్ ఆర్ నరసింహమూర్తి, డీసీఆర్‌బీ సీఐ వి శ్రీనివాసరావు, వివిధ పోలీసు స్టేషన్ల సర్కిల్ ఇన్‌స్పెక్టర్లు, సబ్ ఇన్‌స్పెక్టర్లు, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు. పెద్దాపురం సబ్ డివిజన్ పరిధిలో ఏబీజీ తిలక్ నేతృత్వంలో పెద్దాపురం, సామర్లకోట ప్రాంతాల్లో నిర్వహించిన సైకిల్ ర్యాలీలో సామర్లకోట సీఐ ఆళ్ల కృష్ణ భగవాన్, ఎస్ఐ మూర్తి, ఎస్ఐ గరగారావు, ఎస్ఐ రాజా, పెద్దాపురం సీసీఎస్ సీఐ అంకబాబు, ఎస్ఐ మౌనిక, ప్రత్తిపాడు సీఐ బి సూరి అప్పారావు, ఉమెన్ ఎస్ఐ ఎస్ లక్ష్మీకాంతం, జగ్గంపేట ఎస్ఐ టి రఘునాథ్ రావు తదితర అధికారులు, సిబ్బంది, ప్రజలు ఉత్సాహంగా పాల్గొన్నారు. జిల్లా వ్యాప్తంగా నిర్వహించిన ఈ కార్యక్రమం ప్రజల్లో ఆరోగ్య అవగాహన, ఫిట్‌నెస్ పట్ల ఆసక్తి, పర్యావరణ పరిరక్షణపై చైతన్యం కలిగించడంలో విజయవంతమైందని అధికారులు తెలిపారు.

## శ్రీ రంగనాథ స్వామి ఆలయానికి రూ.1.50 లక్షల విరాళం అందజేసిన వినయ్ గౌడ్



సందేశం టైమ్స్, సంగారెడ్డి, జూన్ 08, అందోల్ టౌన్ ప్రతినిధి బి రమేష్ బాబు: అందోల్ నియోజకవర్గ పరిధిలోని ప్రసిద్ధ శ్రీ రంగనాథ స్వామి ఆలయానికి పొట్టిపల్లి మండల కాంగ్రెస్ పార్టీ నాయకులు పెద్దపట్ల వినయ్ గౌడ్ రూ.1,50,000 విరాళంగా అందజేశారు. ఆలయ అభివృద్ధి మరియు ఆధ్యాత్మిక సేవల పట్ల ఆయన చూపుతున్న అంకితభావాన్ని గ్రామ ప్రజలు, కాంగ్రెస్ పార్టీ నాయకులు అభినందించారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ ఆలయ సేవలో వినయ్ గౌడ్ చేస్తున్న సహాయం ఆదర్శప్రాయమని కొనియాడారు. ఈ కార్యక్రమంలో కౌన్సిలర్ రామకృష్ణ, యూత్ కాంగ్రెస్ నాయకులు సాయి గౌడ్, శివ గౌడ్ తదితరులు పాల్గొన్నారు.



## నిర్లక్ష్యానికి గురైన కోదాడ గాంధీ పార్కు.. ప్రమాదకరంగా మారిన ఆట వస్తువులు

సందేశం టైమ్స్, కోదాడ, జూన్ 08, ప్రతినిధి: కోదాడ పట్టణ కేంద్రంలో ఉన్న ప్రముఖ గాంధీ పార్కు తీవ్ర నిర్లక్ష్యానికి గురవుతోంది. పార్కులో పిల్లలు ఆడుకునే ఆట వస్తువులు పూర్తిగా శిథిలావస్థకు చేరుకోవడంతో చిన్నారులు భయాందోళనకు గురవుతున్నారు. విరిగిపోయిన ఊయలలు, దెబ్బతిన్న జారుడు బల్లల కారణంగా ప్రమాదాలు జరిగే అవకాశం ఉందని తల్లిదండ్రులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. పార్కు నిర్వహణ పూర్తిగా నిర్లక్ష్యంగా మారిందని, ఎక్కడ చూసినా చెత్తాచెదారంతో అపరిశుభ్ర వాతావరణం నెలకొందని సందర్శకులు మండిపడుతున్నారు. పార్కులో ఏర్పాటు చేసిన బాత్రూంలకు తాళాలు వేసి ఉంచడంతో చిన్న పిల్లలు, మహిళలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని తెలిపారు. పట్టణ నడిబొడ్డున ఉన్న ఈ పార్కును వెంటనే పునరుద్ధరించి, పాత ఆట వస్తువుల స్థానంలో కొత్తవి ఏర్పాటు చేయాలని ప్రజలు కోరుతున్నారు. మున్సిపల్ అధికారులు తక్షణమే స్పందించి పార్కును శుభ్రపరచడంతో పాటు బాత్రూంలను ప్రజలకు అందుబాటులో ఉంచాలని పట్టణ వాసులు డిమాండ్ చేస్తున్నారు.




## జహీరాబాద్ అసెంబ్లీ క్రైస్తవ మైనారిటీ కోఆర్డినేటర్ అస్మాకు ఘన సన్మానం

సందేశం టైమ్స్, జహీరాబాద్, జూన్ 08, ప్రతినిధి: జహీరాబాద్ అసెంబ్లీ క్రైస్తవ మైనారిటీ కోఆర్డినేటర్‌గా ఇటీవల నియమితులైన అస్మా గారిని జీబీ గార్డెన్ మెమోరియల్ మెథడిస్ట్ సెంట్రల్ చర్చి కమిటీ సభ్యులు, హోసన్నా మినిస్ట్రీస్ సంఘం ఆధ్వర్యంలో ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా పాస్టర్ల ప్రత్యేక ప్రార్థనల నడుమ చర్చి పెద్దలు, కమిటీ సభ్యులు, డబ్ల్యూఎస్‌సీఎస్ కమిటీ సభ్యులు, సంఘస్తులు అస్మా గారికి శాలువా కప్పి పుష్పగుచ్ఛం అందజేసి అభినందనలు తెలిపారు. క్రైస్తవ సమాజ అభ్యున్నతికి ఆమె సేవాభావం ప్రశంసనీయమని పేర్కొంటూ, జహీరాబాద్ అసెంబ్లీ పరిధిలోని క్రైస్తవ మైనారిటీల సంక్షేమం కోసం ఆమె సమర్థవంతంగా పనిచేస్తారనే నమ్మకాన్ని వ్యక్తం చేశారు. అనంతరం అస్మా మాట్లాడుతూ ప్రభుత్వ సంక్షేమ పథకాలపై అవగాహన కల్పించడం, అర్హులైన ప్రతి క్రైస్తవ కుటుంబానికి విద్య, స్వయం ఉపాధి, జీవనోపాధి రంగాల్లో ప్రభుత్వ సహాయం అందేలా కృషి చేయడం తన ప్రధాన లక్ష్యమని తెలిపారు. తనపై ఉంచిన బాధ్యతను నిజాయితీగా నిర్వర్తించేందుకు సమాజం ఆశీస్సులు, సహకారం అవసరమని కోరారు. ఈ కార్యక్రమంలో చర్చి పెద్దలు సత్యానందం, నిరంజన్, దేవదాస్, వినయ్ కుమార్, లాజర్, ప్రభాకర్, మోసెస్, తబిత, రోజీ సోలమన్, రజిని రాణి తదితరులు మరియు సంఘస్తులు పాల్గొన్నారు.



## ఘనంగా పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం

సందేశం టైమ్స్, పుల్కల్, జూన్ 08, ప్రతినిధి: సంగారెడ్డి జిల్లా పుల్కల్ మండలం సింగూరు ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో 2005-06 విద్యా సంవత్సరంలో పదవ తరగతి చదివిన పూర్వ విద్యార్థులు ఆదివారం ఆత్మీయ సమ్మేళనం నిర్వహించారు. సుమారు 20 ఏళ్ల తర్వాత ఒకే వేదికపై కలుసుకున్న పూర్వ విద్యార్థులు ఒకరినొకరు ఆప్యాయంగా పలకరించుకొని అలనాటి మధుర జ్ఞాపకాలను గుర్తుచేసుకున్నారు. రోజంతా సాంస్కృతిక కార్యక్రమాలతో ఉల్లాసంగా గడిపారు. అనంతరం తమకు విద్యాబోధన చేసిన గురువులను శాలువాలతో ఘనంగా సత్కరించి జ్ఞాపికలు అందజేశారు. వివిధ రంగాల్లో ఉన్నత స్థానాల్లో స్థిరపడిన తమ విద్యార్థులను చూసి ఉపాధ్యాయులు హర్షం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు, పూర్వ విద్యార్థులు పాల్గొన్నారు.



## స్పీడ్ అప్‌గా ధాన్యం కొనుగోలు.. రైతులకు రూ.664.67 కోట్ల చెల్లింపులు పూర్తి

సందేశం టైమ్స్, మెదక్, జూన్ 08, మెదక్ నియోజకవర్గ ప్రతినిధి: మెదక్ జిల్లాలో ధాన్యం కొనుగోలు ప్రక్రియ స్పీడ్ అప్‌గా కొనసాగుతోందని జిల్లా కలెక్టర్ ప్రతిమా సింగ్ తెలిపారు. జిల్లా వ్యాప్తంగా 81,266 మంది రైతుల నుంచి 3,75,471.120 మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని కొనుగోలు చేసినట్లు వెల్లడించారు. ఇప్పటివరకు 62,363 మంది రైతులకు రూ.664.67 కోట్ల చెల్లింపులు పూర్తిచేసినట్లు పేర్కొన్నారు. జిల్లాలో ఏర్పాటు చేసిన 260 ధాన్యం కొనుగోలు కేంద్రాలను ఇప్పటికే మూసివేసినట్లు తెలిపారు. రైతులు అధైర్యపడాల్సిన అవసరం లేదని, చివరి గింజ వరకు ప్రభుత్వం ధాన్యాన్ని కొనుగోలు చేస్తుందని ఆదివారం విడుదల చేసిన ప్రకటనలో జిల్లా కలెక్టర్ స్పష్టం చేశారు. రైతులకు ప్రభుత్వం అన్ని విధాల అండగా ఉంటుందని పేర్కొన్నారు.

## సురక్షిత ఆహారం అందించడమే ప్రభుత్వ లక్ష్యం: మంత్రి దామోదర రాజనర్సింహ



సందేశం టైమ్స్, సంగారెడ్డి జిల్లా, ఆందోల్ మండల్ ప్రతినిధి, జూన్ 08: ఆహార భద్రత విషయంలో ప్రభుత్వం ఎట్టి పరిస్థితుల్లోనూ రాజీ పడదని, ప్రజలకు నాణ్యమైన మరియు సురక్షితమైన ఆహార పదార్థాలు అందించడమే ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని రాష్ట్ర ఆరోగ్య, వైద్య మరియు కుటుంబ సంక్షేమ శాఖ మంత్రి దామోదర రాజనర్సింహ తెలిపారు. ఆదివారం ఆందోల్‌లో నిర్వహించిన కార్యక్రమంలో మంత్రి మాట్లాడుతూ ప్రజల ఆరోగ్య పరిరక్షణ కోసం ఆహార భదత పమాణాలను కటుదిటంగా అమలు చేస్తున్నామని చెప్పారు. కల్తీ ఆహార పదార్థాల తయారీ, విక్రయాలు, నిల్వలపై అధికారులు నిరంతరం నిఘా ఉంచుతున్నారని పేర్కొన్నారు. ప్రతి పౌరుడు సురక్షితమైన, పరిశుభ్రమైన ఆహారాన్ని వినియోగించే హక్కు కలిగి ఉన్నారని, ఆ దిశగా ప్రభుత్వం పలు చర్యలు చేపడుతోందన్నారు. ఆహార నాణ్యత, పరిశుభ్రత పట్ల వ్యాపారులు బాధ్యతగా వ్యవహరించాలని సూచిస్తూ ప్రజల ఆరోగ్యానికి హాని కలిగించే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. అనంతరం ఆహార భద్రతకు సంబంధించిన అవగాహన కార్యక్రమాల్లో పాల్గొన్న మంత్రి ప్రజలు పరిశుభ్రమైన ఆహార పదార్థాలనే వినియోగించి ఆరోగ్యాన్ని కాపాడుకోవాలని సూచించారు.



## కల్కి భగవాన్ కల్యాణోత్సవంలో పాల్గొన్న జగ్గారెడ్డి

సందేశం టైమ్స్, సంగారెడ్డి, జూన్ 08, సంగారెడ్డి జిల్లా కోఆర్డినేటర్ బి. సంగమేశ్వర్: సంగారెడ్డి పట్టణంలోని పీఎస్ఆర్ గార్డెన్‌లో కల్కి భగవాన్ భక్త బృందం ఆధ్వర్యంలో నిర్వహించిన కల్కి భగవాన్ కల్యాణ మహోత్సవంలో టీపీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్ జగ్గారెడ్డి పాల్గొన్నారు. ఈ సందర్భంగా కల్కి భగవాన్ దంపతుల విగ్రహ మూర్తులకు పూలమాలలు సమర్పించి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం జగ్గారెడ్డి మాట్లాడుతూ కల్కి భగవాన్ కృపాకటాక్షాలు ప్రజలందరిపై ఉండాలని, ప్రజలు సుఖశాంతులతో జీవించాలని ఆకాంక్షించారు. ప్రతి ఏటా క్రమం తప్పకుండా కల్యాణోత్సవం నిర్వహిస్తున్న కల్కి భగవాన్ భక్త బృందాన్ని ఆయన అభినందించారు. ఈ సందర్భంగా నిర్వాహకులు కల్కి భగవాన్ ఆలయ నిర్మాణం కోసం స్థలం సేకరించినట్లు, ఆలయ నిర్మాణానికి ఏర్పాట్లు చేస్తున్నట్లు జగ్గారెడ్డి దృష్టికి తీసుకువచ్చి సహకారం అందించాలని కోరారు. ఆలయ నిర్మాణానికి తన పూర్తి సహకారం అందిస్తానని జగ్గారెడ్డి హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో టీపీసీసీ ప్రధాన కార్యదర్శి తోపాజి అనంత్ కిషన్, కల్కి భక్త బృంద సభ్యులు సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.



## సంగారెడ్డి జిల్లాలో ఘనంగా తెలంగాణ రక్షణ సేన పార్టీ జెండా ఆవిష్కరణ

సందేశం టైమ్స్, సంగారెడ్డి, జూన్ 08, ప్రతినిధి: సంగారెడ్డి జిల్లాలో తెలంగాణ రక్షణ సేన (టీఆర్ఎస్) పార్టీ ఆధ్వర్యంలో నిర్వహించిన పార్టీ జెండా ఆవిష్కరణ కార్యక్రమం ఘనంగా జరిగింది. ఈ కార్యక్రమానికి రాష్ట్ర అధినేత్రి శ్రీమతి గౌరవ కవితమ్మ ముఖ్య అతిథిగా హాజరై పటాన్‌చెరు టౌన్‌తో పాటు సంగారెడ్డి టౌన్‌లో పార్టీ జెండాను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ పార్టీ బలోపేతంతో పాటు ప్రజా సమస్యల పరిష్కారానికి కార్యకర్తలు కృషి చేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో నారాయణఖేడ్ నియోజకవర్గ ఇంచార్జ్ బాపుమల్ శెట్టి పాల్గొనగా, ఆయనతో పాటు సుమన్ పాటిల్, సాయి తేజ, మాజీ ఎంపీటీసీ విట్టల్ చారి, మాణిక్య ముదిరాజ్, మోహన్ నాయక్, ఆరిఫ్, ఇస్మాయిల్, బాపురాజు, సుధాకర్, నరసారెడ్డి, బసవరాజ్ తదితర నాయకులు, కార్యకర్తలు పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేశారు.



## శ్రీ ఎల్లమ్మ పోచమ్మ దేవాలయంలో దీక్ష ముగింపు పూజల్లో పాల్గొన్న మాద్రి పృథ్వీరాజ్

సందేశం టైమ్స్, సంగారెడ్డి, జూన్ 08, సంగారెడ్డి జిల్లా కోఆర్డినేటర్ బి. సంగమేశ్వర్: పటాన్‌చెరు నియోజకవర్గం జేపీ కాలనీ డివిజన్ పరిధిలోని సాయి గణేష్ కాలనీలో నూతనంగా నిర్మించిన శ్రీ ఎల్లమ్మ పోచమ్మ దేవాలయంలో విగ్రహ ప్రతిష్ఠ అనంతరం నిర్వహించిన 41 రోజుల దీక్ష ముగింపు ప్రత్యేక పూజా కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు, ఎండీఆర్ ఫౌండేషన్ కో-ఫౌండర్ మాద్రి పృథ్వీరాజ్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించి అమ్మవారి ఆశీస్సులు పొందారు. దేవాలయాలు భక్తి, సంస్కృతి, సామాజిక ఐక్యతకు ప్రతీకలని, ఇలాంటి ఆధ్యాత్మిక కార్యక్రమాలు సమాజంలో సత్సంబంధాలను మరింత బలోపేతం చేస్తాయని పృథ్వీరాజ్ పేర్కొన్నారు. అమ్మవారి కృపతో ప్రతి కుటుంబం సుఖశాంతులు, ఆయురారోగ్యాలతో వర్ధిల్లాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు, కాలనీ పెద్దలు, స్థానిక నాయకులు, భక్తులు, కాలనీ వాసులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## ఆన్‌లైన్ ఫార్మసీలపై డీసీఏ ప్రత్యేక దాడులు.. 41 మెడికల్ షాపులకు షోకాజ్ నోటీసులు






సందేశం టైమ్స్, హైదరాబాద్, జూన్ 08, ప్రతినిధి: తెలంగాణ డ్రగ్స్ కంట్రోల్ అడ్మినిస్ట్రేషన్ (డీసీఏ) రాష్ట్రవ్యాప్తంగా ఆన్‌లైన్ ఫార్మసీలపై ప్రత్యేక ఎన్‌ఫోర్స్‌మెంట్ డ్రైవ్ నిర్వహించింది. జూన్ 6న చేపట్టిన ఈ తనిఖీల్లో మొత్తం 166 మెడికల్ షాపులను పరిశీలించగా, నిబంధనల ఉల్లంఘనలు గుర్తించిన 41 మెడికల్ షాపులకు షోకాజ్ నోటీసులు జారీ చేసినట్లు డీసీఏ వెల్లడించింది. తనిఖీ చేసిన వాటిలో ఆన్‌లైన్ మెడిసిన్ డెలివరీ సేవలకు అనుబంధంగా ఉన్న 159 మెడికల్ షాపులు, ఇండియామార్ట్ వంటి ఆన్‌లైన్ బీ2బీ ప్లాట్‌ఫారమ్‌లకు సంబంధించిన 7 షాపులు ఉన్నాయి. తనిఖీల్లో మందుల అమ్మకాల బిల్లులు నిర్వహించకపోవడం, ప్రిస్క్రిప్షన్ డ్రగ్ రిజిస్టర్లు, షెడ్యూల్ హెచ్1 డ్రగ్ రిజిస్టర్లు సరిగా నిర్వహించకపోవడం, మందుల కొనుగోలు ఇన్వాయిసులు చూపించకపోవడం, రిజిస్టర్డ్ మెడికల్ ప్రాక్టీషనర్ ఇచ్చిన చెల్లుబాటు అయ్యే ప్రిస్క్రిప్షన్ లేకుండానే మందులు విక్రయించడం, రిజిస్టర్డ్ ఫార్మసిస్ట్ పర్యవేక్షణ లేకుండా మందుల అమ్మకాలు జరపడం, కొనుగోలు-అమ్మకాల రికార్డులను సక్రమంగా నిర్వహించకపోవడం వంటి ఉల్లంఘనలు గుర్తించినట్లు అధికారులు తెలిపారు. డ్రగ్స్ అండ్ కాస్మెటిక్స్ యాక్ట్-1940 మరియు సంబంధిత నిబంధనల ప్రకారం తదుపరి చర్యలు తీసుకుంటామని డీసీఏ స్పష్టం చేసింది. ఆన్‌లైన్ ప్లాట్‌ఫారమ్‌లకు అనుబంధంగా పనిచేసే మెడికల్ షాపులు సహా అన్ని ఔషధ దుకాణాలు చట్టబద్ధ నిబంధనలను తప్పనిసరిగా పాటించాలని హెచ్చరించింది. మందులకు సంబంధించిన అక్రమ కార్యకలాపాలు, నార్కోటిక్ డ్రగ్స్, సైకోట్రోపిక్ పదార్థాల తయారీ లేదా విక్రయాలపై అనుమానాలు ఉన్నట్లయితే ప్రజలు డీసీఏ టోల్ ఫ్రీ నంబర్ 1800-599-6969కు సమాచారం అందించాలని సూచించింది.

## మైనారిటీ యువతకు మెగా జాబ్ మేళా.. జూన్ 9న హైదరాబాద్‌లో నిర్వహణ



సందేశం టైమ్స్, హైదరాబాద్, జూన్ 08, ప్రతినిధి: తెలంగాణ మైనారిటీస్ ఫైనాన్స్ కార్పొరేషన్ (టీజీఎంఎఫ్‌సీ) ఆధ్వర్యంలో నిరుద్యోగ మైనారిటీ యువతకు మెగా జాబ్ మేళా జూన్ 9, 2026న హైదరాబాద్ నాంపల్లి రెడ్ రోజ్ ప్యాలెస్‌లో నిర్వహించనున్నట్లు అధికారులు ప్రకటించారు. ఈ ఉద్యోగ మేళాను మైనారిటీ సంక్షేమం, పబ్లిక్ ఎంటర్‌ప్రైజెస్ మరియు ప్రభుత్వ సంబంధాల శాఖ మంత్రి మహ్మద్ అజరుద్దీన్ ప్రారంభించనున్నారు. ఐటీ, బ్యాంకింగ్, ఫైనాన్స్, హెల్త్‌కేర్, మాన్యుఫ్యాక్చరింగ్, లాజిస్టిక్స్, హాస్పిటాలిటీ, కస్టమర్ సర్వీసెస్ వంటి రంగాలకు చెందిన సుమారు 40 నుండి 50 వరకు ప్రముఖ కంపెనీలు ఈ నియామక కార్యక్రమంలో పాల్గొననున్నాయి. మైనారిటీ యువతకు ఉపాధి అవకాశాలు కల్పించి వారిని ఆర్థికంగా సాధికారత చేయాలనే ప్రభుత్వ లక్ష్యంలో భాగంగానే ఈ కార్యక్రమాన్ని చేపట్టినట్లు అధికారులు తెలిపారు. టీజీఎంఎఫ్‌సీ చైర్మన్ మహ్మద్ ఒబేదుల్లా కొత్వాల్ మాట్లాడుతూ ఉద్యోగార్థులకు ప్రముఖ సంస్థలతో నేరుగా అనుసంధానం కల్పించే వేదికగా ఈ జాబ్ మేళా ఉపయోగపడుతుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో మైనారిటీ సంక్షేమ శాఖ ఉన్నతాధికారులు, పాల్గొనే కంపెనీల ప్రతినిధులు పాల్గొననున్నారు.

## విశ్వవేదికపై సింగరేణి జెండా.. అంతర్జాతీయ మైన్స్ రెస్క్యూ పోటీల్లో ప్రథమ బహుమతి



సందేశం టైమ్స్, హైదరాబాద్, జూన్ 08, ప్రతినిధి: అంతర్జాతీయ మైన్స్ రెస్క్యూ పోటీల్లో సింగరేణి రెస్క్యూ జట్టు అద్భుత ప్రతిభ కనబరిచి ప్రథమ బహుమతి సాధించింది. చైనా, కెనడా, ఆస్ట్రేలియా వంటి దేశాల జట్లను వెనక్కి నెట్టి భూగర్భ గనుల రక్షణ విభాగంలో విశ్వవిజేతగా నిలిచింది. జాంబియా దేశంలో నిర్వహించిన ఈ ప్రతిష్ఠాత్మక పోటీల్లో సింగరేణి జట్టు సాధించిన విజయాన్ని అంతర్జాతీయ స్థాయిలో సరికొత్త రికార్డుగా పేర్కొంటున్నారు. ఈ సందర్భంగా హైదరాబాద్‌లోని మహాత్మా జ్యోతిరావు పూలే ప్రజాభవన్‌లో రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్కను సింగరేణి సీఎండీ జ్యోతి బుద్ధ ప్రకాష్‌తో కలిసి రెస్క్యూ జట్టు మర్యాదపూర్వకంగా కలిసింది. వారు సాధించిన ట్రోఫీలు, మెడల్స్‌ను ఉప ముఖ్యమంత్రికి అందజేశారు. ఈ సందర్భంగా భట్టి విక్రమార్క జట్టును ప్రత్యేకంగా అభినందిస్తూ, భూగర్భ గనుల ప్రమాద పరిస్థితుల్లో ప్రాణాలను పణంగా పెట్టి సేవలు అందించే రెస్క్యూ సిబ్బంది పాత్ర అమూల్యమని కొనియాడారు. సింగరేణి సంస్థ గనుల రంగంలో మాత్రమే కాకుండా అన్ని రంగాల్లో అగ్రగామిగా నిలుస్తోందని, భవిష్యత్తులో మరింత ప్రోత్సాహం అందిస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో సింగరేణి డైరెక్టర్ (పి అండ్ పి) కె. వెంకటేశ్వర్లు, జీఎం (కో-ఆర్డినేషన్, మార్కెటింగ్) టి. శ్రీనివాస్, రెస్క్యూ జీఎం శ్రీనివాసరెడ్డి, రెస్క్యూ జట్టు సభ్యులు మరియు ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

పత్రిక పేరు : సందేశం టైమ్స్ (Sandesham Times) – రిజిస్ట్రేషన్ నం :TGTEL/25/A0348, టైటిల్ కోడ్: Sandhesham Times,(పబ్లికేషన్: అమృత వెంకట్ మీడియా పబ్లికేషన్ ప్రైవేట్ లిమిటెడ్.) ప్రచురణ స్థలం: 3-82, వాయిల సింగారం గ్రామం, అనంతగిరి మండలం, సూర్యాపేట జిల్లా, తెలంగాణ – 508206, ప్రచురణకర్త / publisher : కాసే అమృత, మొబైల్: 9052045435, ఈ-మెయిల్: sandeshamtimes@gmail.com, వెబ్‌సైట్: www.sandeshamtimes.com, ముద్రణ స్థలం: సండే ప్రింటింగ్ ప్రెస్ (Sunday Printing Press), 3-4297, సరస్వతి కాంప్లెక్స్, SVN కాలనీ, గుంటూరు, ఆంధ్రప్రదేశ్ – 522006.